# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 17 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4



## 26 నుంచి
# రైతుల ఆమరణ నిరాహార దీక్ష

**బలగంటీవీ, హైదరాబాద్**

కేంద్ర ప్రభుత్వానికి రైతు సంఘాలు మరోసారి హెచ్చరికలు జారీ చేశాయి. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు డిమాండ్లను నెరవేర్చకపోతే తమ పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని, ఈ నెల 26 నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా శనివారం హెచ్చరించాయి. ఈ సందర్భంగా ఎస్‌కేఎం నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్ మీడియాతో మాట్లాడుతూ తమ డిమాండ్లను నెరవేర్చడానికి కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఫిబ్రవరి 18 నుంచి తమతో ఎలాంటి చర్చలు కూడా జరపలేదని ఆరోపించారు. కేంద్రం తమ డిమాండ్లు తీర్చకపోతే నవంబర్ 26 నుంచి ఖనౌరి బోర్డర్ పాయింట్‌లో ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభిస్తామని చెప్పారు.

## నేటి నుంచి గ్రూప్-3 పరీక్షలు

- 1,401 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 5.36 లక్షల మంది దరఖాస్తు



వివరాలు 3వ పేజీలో


## టెక్స్ టైల్ పార్క్ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు..!

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 863 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు



వివరాలు 3వ పేజీలో

## టీజీసెట్ 2024 ఫలితాలు విడుదల




వివరాలు 3వ పేజీలో

## ఆహార నాణ్యతలో
# హైదరాబాద్ ఆఖరు

- నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో సర్వే సంచలన విషయాలు
- నగరంలో హోటల్స్ కనీస నాణ్యత ప్రమాణాలు పాటించట్లేదంటూ సర్వేలో వెల్లడి
- 19 ప్రధాన నగరాల్లో సర్వే నిర్వహణ





**బలగంటీవీ, హైదరాబాద్**

కల్తీ ఆహారంతో హైదరాబాద్ బిర్యానీ బ్రాండ్ దెబ్బతింది. నగరంలో హోటల్స్ కనీస నాణ్యత ప్రమాణాలు పాటించట్లేదంటూ సర్వేలో వెల్లడైంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తాజాగా చేసిన సర్వే సంచలనం రేపింది.

దేశంలోని 19 ప్రధాన నగరాల్లో నిర్వహించిన ఈ సర్వే ప్రకారం, హైదరాబాద్ ఫుడ్ క్వాలిటీలో చివరి స్థానానికి పడిపోయింది. నగరంలోని 62 శాతం హోటళ్లు గడువు ముగిసిన, పాడైపోయిన ఆహార పదార్థాలను వినియోగిస్తున్నట్లు ఈ సర్వేలో వెల్లడైంది. ఫుడ్ నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో నగరం పూర్తిగా విఫలమైందని సర్వే పేర్కొంది. గడిచిన రెండు నెలల వ్యవధిలో 84 శాతం ఫుడ్ పాయిజన్ కేసులు నమోదైన రాష్ట్రంగా భాగ్యనగరం నిలిచింది. బిర్యానీ శాంపిల్స్ లో ప్రమాదకరమైన కలర్స్ వాడుతున్నట్లు గుర్తించారు. 62% హోటల్స్, గడువుతీరిన పాడైపోయిన కుళ్లిన ఆహారాన్ని కస్టమర్లకు వడ్డిస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది.

ఇక తాజాగా జీహెచ్ఎంసీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా పలు రెస్టారెంట్లు, హోటళ్లపై చేసిన దాడుల్లో చీకటి నిజాలు వెలుగుచూశాయి. అక్కడ కుళ్లిన చికెన్, పురుగులు పట్టిన మసాలాలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. చాలా చోట్ల బిర్యానీల్లో బల్లులు, బొద్దింక లు, పలు అవశేషాలు కూడా లభ్యమయ్యాయి. ఈ పరిణామాలతో అనేక హోటళ్లను సీజ్ చేశారు.

# నేతన్నలు ఆత్మస్థైర్యంతో బతకాలి..
## ఆత్మహత్యలు చేసుకోవద్దు..

- బలగం టీవీ సీఈవో బాలు కాయితి
- అనాథలైన చిన్నారులకు రెండు లక్షల ఆర్థిక సాయం అందజేత.



### చేయూత

**బలగంటీవీ, సిరిసిల్ల**

నేతన్నలు ఆత్మస్థైర్యంతో బతకాలి, ఆత్మహత్యలు చేసుకోవద్దు అని బలగం టీవీ సీఈవో బాలు కాయితి అన్నారు. ఆర్డర్‌లు లేక , ఉపాధీ కరువై ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేటకు చెందిన నేత కార్మిక దంపతులు బైరి అమర్-స్రవంతి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. వారి ఆత్మహత్యతో అనాథలైన వారి ముగ్గురు చిన్నారులకు బలగం టీవీ ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని బలగం టీవీ సీఈవో బాలు కాయితి అందజేశారు. ఈ సందర్భంగా బాలు కాయితి మాట్లాడుతూ తమ మిత్రబృందం అంతా కలిసి రూ.2 లక్షల రూపాయలు జమ చేసి, అనాథలైన ముగ్గురు పిల్లలపై ఒక్కొక్కరిపై రూ. 50 వేలను ఫిక్స్ డిపాజిట్ చేశామని, ఖర్చులకు 50 వేల రూపాయలు అందజేశామని తెలిపారు. నేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, అనాథలైన చిన్నారులకు మానతావాదులు ముందుకొచ్చి ఆదుకోవాలని కోరారు.

## సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా గద్దర్ కూతురు

**బలగంటీవీ, హైదరాబాద్**



తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా గద్దర్ కూతురు డాక్టర్ గుమ్మడి వెన్నెలను నియమిస్తూ ప్రభుత్వం శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు డాక్టర్ వెన్నెలను ప్రభుత్వ ఆదేశాల మేరకు నియమిస్తున్నట్లు ప్రిన్సిపల్‌సెక్రటరి వెల్లడించారు. ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు తెలంగాణ సాంస్కృతిక ఔనత్యాన్ని ఇనుమడించే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అల్వాల్ వెంకటాపురంకు చెందిన వెన్నెల ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

## ‘బీజేపీ మూసీ నిద్ర’ ప్రారంభం



**బలగంటీవీ, హైదరాబాద్**

మూసీ పరివాహక ప్రాంతాల్లో “బీజేపీ మూసీ నిద్ర” కార్యక్రమం శనివారం రాత్రి ప్రారంభమైంది. మూసి సుందరీకరణ పేరుతో మూసి వాసుల ఇళ్లను కూల్చడం..అక్కడి ప్రజలను మరోచోటుకు తరలించడం పట్ల బీఆర్ఎస్ తో పాటు బిజెపి వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటున్న వారిని ఇక్కడి నుండి వేరే చోటికి వెళ్ళమని చెప్పడం..ఇల్లు కూల్చేస్తాం అంటే ఎలా అని వారంతా ప్రశ్నించారు. అయితే సియోల్ తరహాలో హైదరాబాద్‌లో మూసీని పునరుజ్జీవింపజేస్తామంటూ తెలంగాణ లోని రేవంత్ సర్కార్ చెబుతోంది. మూసీ పునరుజ్జీవానికి అడ్డుపడితే బుల్డోజర్లతో తొక్కిస్తామని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. రేవంత్ కామెంట్స్‌కు బీజేపీ నేత, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మూసి ప్రాంతం పేదలకు మనోధైర్యం కల్పిందేందుకు, వారికి అండగా ఉంటానని కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన కిషన్ రెడ్డి.. బుల్డోజర్లు వస్తే చావడానికైనా సిద్ధమేనని చెప్పారు. ఈ క్రమంలోనే మొన్న మూసి వద్దా నిద్రపోగలరా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన సవాల్ ను స్వీకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దానికి తగినట్లుగా మూసీ పరివాహక ప్రాంతాల్లో బీజేపీ నిద్ర కార్యక్రమం చేపట్టారు.

శనివారం రాత్రి అంబర్‌పేట్ తులసి రామ్ నగర్ మూసి పేదల నివాసం ప్రాంతంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా ముఖ్యనేతలు బస్తీ నిద్ర చేశారు. మూసీ నది వెంట 21 ప్రాంతాల్లో నాయకులు బస చేశారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అంబర్‌పేట నియోజకవర్గం తులసీ రామ్ నగర్ లోని మూసీ ప్రాంత ప్రజలను కలిసి, వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ స్పోక్స్ పర్సన్ రాణి రుద్రమ సహా ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కిషన్ రెడ్డితో పాటు, బీజేపీ ఎంపీలు ఈటెల రాజేందర్, లక్ష్మణ్, కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఇతర నేతలు మూసి ఏరియాలోని 20 ప్రాంతాల్లో రాత్రి బస చేశారు. శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు బీజేపీ నేతలు ఆయా ప్రాంతాల్లో రాత్రి బస చేయనున్నారు. అంబర్‌పేటలోని తులసీరాంనగర్‌లో కిషన్ రెడ్డి, ఓల్డ్ మలక్‌పేటలోని శాలివాహననగర్‌లో కె.లక్ష్మణ్, ఎల్బీ నగర్‌లోని గణేశ్ నగర్‌లో ఈటల రాజేందర్, రాజేంద్రనగర్‌లోని హైదర్‌షా కోటలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అఫ్జల్‌గంజ్‌లోని రెసిడెన్షియల్ హౌసింగ్ బస్తీలో బీబీ పాటిల్ బస చేశారు.

## కాంగ్రెస్‌కు బీజేపీ రక్షణ కవచం



- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

**బలగంటీవీ, హైదరాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీజేపీ రక్షణ కవచంగా పనిచేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డికి బండి సంజయ్ సహాయక మంత్రిగా మారాడని అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా “ రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్న పరిణామాలను మీరంతా గమనిస్తూనే ఉన్నారు తెలంగాణ ఏర్పడిన మొదట్లో హైదరాబాద్‌కు పెట్టుబడులు రావని, హిందూ-ముస్లింల గొడవలు జరుగుతాయని ప్రచారం చేశారు కానీ కేసీఆర్ గారు అభివృద్ధే కులం, సంక్షేమమే మతం అన్నట్లుగా అభివృద్ధి చేసి అవన్నీ ప్రచారాలే అనే విధంగా చేశారు దేశంలో తెలంగాణను ఎన్నో రంగాల్లో రోల్ మోడల్‌గా నిలిపారు. వ్యవసాయం, విద్యుత్, పేదవాళ్లను ఆదుకోవటం, సంక్షేమం, ఇంటింటికి నీళ్లు ఇచ్చే కార్యక్రమాలు ఇలా అన్ని రంగాల్లో తెలంగాణను నంబర్ వన్ చేశారు. కరోనా లాంటి సమయంలో కూడా సంక్షేమం ఆపకుండా పేదలను కడుపులో పెట్టుకొని చూశారు. ఆయన చేసిన అభివృద్ధి కారణంగానే రాజేంద్రనగర్‌లో ప్రకాష్ గౌడ్‌ను ప్రజలు గెలిపించారు

పైరవీల కోసం అక్కడి ఎమ్మెల్యే పార్టీ మారినప్పటికీ మేము ఉన్నామని కార్యకర్తలు బలంగా నిలవటం చూస్తుంటే గర్వంగా ఉంది. కష్టాలు ప్రతి మనిషికి వస్తాయి. మనకు కూడా వచ్చాయి. కానీ వాటిని మనం గట్టిగా ఎదుర్కోవాలి 2000 సంవత్సరంలో కేసీఆర్ గారు పార్టీ పెట్టినప్పుడు ఒక్కరే ఉన్నారు. 24 ఏళ్లలో ఇంతింతై వటుండింతే అన్నట్లుగా రాష్ట్రం నలుమూలలా బీఆర్ఎస్ బలంగా మారింది. కేసీఆర్ అంటే ఒక శక్తి. కేసీఆర్‌ను ఫినిష్ చేస్తా అని రేవంత్ రెడ్డి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నాడు గతంలోనూ ఎంతో మంది కేసీఆర్ ఫినిష్ చేస్తా అన్నారు. కానీ చరిత్ర తొంగి చూసుకో రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను ఫినిష్ చేస్తా అన్న వాళ్లు ఎక్కడ ఉన్నారో.. వాళ్లతోనే కాలేదు. నువ్వు ఎంత? కేసీఆర్ తెలంగాణ తీసుకురాకపోయి ఉంటే.. రేవంత్ రెడ్డికి

మిగితా 3వ పేజీలో

# చంద్రబాబు సోదరుడు కన్నుమూత



**బలగంటీవీ, హైదరాబాద్**

ఏపీ ముఖ్యమంత్రి చంద్ర బాబు సోదరుడు రామ్మూర్తి నాయు డు కన్నుమూ శారు. ఆయన గత కొంతకాలంగా . అనారోగ్యంతో బాధపడుతున్నారు.. దీంతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసు పత్రిలో గత వారం రోజుల నుంచి చికిత్స పొందుతున్నారు. శనివారం ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత విషమించి మరణించారు. రామ్మూర్తి నాయుడు శనివారం మధ్యాహ్నం 12.45 లకు మృతిచెందినట్లు ఏఐజీ వైద్యులు ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వైద్యులు అధికారిక ప్రకటన విడుదల చేశారు.నారా రామ్మూర్తినాయుడు 1952లో నారా కర్జూరనాయుడు, అమ్మణమ్మ దంపతుల రెండో సంతానంగా జన్మించారు. రామ్మూర్తి నాయుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిలో ఒకరు సినీ నటుడు రోహిత్ కాగా.. మరొకరు నారా గిరీష్. రామ్మూర్తి నాయుడు 1994లో చంద్రగిరి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత అనారోగ్య కారణాల దృష్ట్యా రాజకీయాలకు దూరమై ఇంటికే పరిమితమయ్యారు. కాగా, మరణించిన సమయంలో రామ్మూర్తి నాయుడు కుమారుడు నారా రోహిత్ , చంద్రబాబు నాయుడు కుమారుడు లోకేష్ అక్కడే ఉన్నారు.

### చంద్రాబాబు నివాళ్లు

గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్ లో తన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు పార్థీవ దేహానికి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు విషయం తెలుసుకొని మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారాన్ని క్యాన్సిల్ చేసుకొని హుటాహుటిని హైదరాబాద్ కు తిరిగి వచ్చారు. బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్ కు చేరుకొని సోదరుడి పార్థీవ దేహం వద్ద నివాళులర్పించారు. రామ్మూర్తి నాయుడు తనయులు హీరో రోహిత్, గిరీశ్ ను చంద్రబాబు ఓదార్చారు. ఆయన వెంట సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, బాలకృష్ణ తదితరులు ఉన్నారు. రాత్రి వరకు హాస్పిటల్ లోనే ఉన్న చంద్రబాబు, లోకేశ్ అక్కడి నుంచి జూబ్లీహిల్స్ లోని తమ నివాసానికి బయల్దేరారు. ఆదివారం ఉదయం ఎయిర్ లిఫ్టింగ్ ద్వారా బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి రామ్మూర్తి నాయుడు మృతదేహాన్ని నారావారిపల్లెకు తరలిస్తారు. ఆ తర్వాత ప్రత్యేక విమానంలో చంద్రబాబు, లోకేశ్ సహా ఇతర కుటుంబ సభ్యులు నారావారిపల్లెకు వెళ్తారు. ఆదివారం మధ్యాహ్నం తర్వాత నారావారిపల్లెలో రామ్మూర్తి నాయుడి అంత్యక్రియలు నిర్వహిస్తారు.

## లగ చర్ల ఘటనలో మరో 8 మంది అరెస్ట్

**బలగంటీవీ, హైదరాబాద్**

వికారాబాద్ జిల్లా లగ చర్ల ఘటనలో మరో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ గ్రామంలో భూసేకరణ ప్రజాభిప్రాయసేకరణకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్‌తోపాటు కడా ప్రత్యేక అధికారి, డీఎస్పీ తదితరులపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే 17 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి కూడా ఉన్నారు. లగచర్ల గ్రామస్థులను అదుపులోకి తీసుకుని పరిగి పోలీసు స్టేషన్ కు తరలించారు. అక్కడ వారిని విచారించారు.

# మహిళా సంఘాల బాధ్యులకు ఏడాదికి రెండు చీరలు



- మార్కెట్ తో పోటీపడాలి.. వృద్ధిలోకి రావాలి
- రూ. 66 లక్షల ఆర్వీఎం క్లాత్ ఆర్డర్ ఇస్తాం.
- నెరవేరిన 30 ఏండ్ల యార్న్ బ్యాంక్ కల
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

మహిళా సంఘాల బాధ్యులకు ఏడాదికి రెండు చీరలు ఇవ్వనున్నామని,వీటికి సంబంధించిన డిజైన్లు పూర్తి అయ్యాయని, త్వరలో వాటికి అవసరమైన ఆర్డర్లు ఇస్తామనిప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ స్థితిగతులపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో యజమానులు, ఆసాములతో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామాయ్యర్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, టెస్కో జీఎం అశోక్ రావు ల తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు..

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్వీ ఎం కు సంబంధించి 66 లక్షల మీటర్ల క్లాత్ ఆర్డర్ ఇవ్వనున్నామని,అన్ని ప్రభుత్వ శాఖలకు కావాల్సిన క్లాత్ ఆర్డర్ ఇప్పించేందుకు కృషి చేస్తున్నానని అన్నారు . . సీఎం రేవంత్ రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధి కోసం యార్న్ బ్యాంక్ ఏర్పాటుకు రూ. 50 కోట్లు మంజూరు చేశారని,80 శాతం క్రెడిట్ పై యార్న్ అందజేస్తామని, టెస్కో ఆధ్వర్యంలో క్లాత్ సేకరిస్తామని అన్నారు . కాటన్ వస్త్ర పరిశ్రమకు సహకారం అందిస్తామని, ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు . విద్యుత్ సబ్సిడీ అంశం కూడా డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి తో చర్చిస్తామని,సిరిసిల్లలో నిలిచిపోయిన పద్మశాలి భవనం పూర్తి చేసే విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని, సిరిసిల్ల జిల్లా అభివృద్ధి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని స్పష్టం చేశారు. అన్ని పనులు ముందుకు సాగుతాయని అన్నారు .

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన కార్మికులు మనోధైర్యంతో ముందుకుసాగాలని, పరిశ్రమను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు .

**ఈ నెల 20 వ తేదీన సీఎం రాక..**

ఈ నెల 20 వ తేదీన మధ్యాహ్నం 12.30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పట్టణంలో సభ ఉంటుందని,పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని, పలు పనులు ప్రారంభిస్తారని అన్నారు .

**ఆధునికత వైపు వెళ్లాలి..**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మార్కెట్ లో వస్తున్న ఆధునికత వైపు ముందుకు వెళ్లాలని చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 6 నెలల వరకు ఉపాధి కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నదని,మిగితా రోజుల్లో ప్రైవేట్ మార్కెట్ లో ఉపాధి పొందేలా ఆలోచన చేయాలని అన్నారు. త్వరలో హెూల్ సేల్ వ్యాపారులతో మీటింగ్ ఏర్పాటు చేస్తానని చెప్పారు. వారికి అవసరమైన క్లాత్ విషయమై చర్చిస్తామని ప్రకటించారు. యార్న్ బ్యాంక్ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, స్వయం సమృద్ధి సాధించాలని అన్నారు . వస్త్ర పరిశ్రమకు చెందిన రూ. 150 నుంచి 200 కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేశామని, యార్న్ సబ్సిడీ కూడా విడుదల చేస్తున్నామని,మిగితా అన్ని సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, టెస్కో జీఎం అశోక్ రావు, హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



## రాజన్న క్షేత్రం, జిల్లా సమగ్ర అభివృద్దే ధ్యేయంగా సీఎం పర్యటన..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కొనసాగనున్న సీఎం సభకు జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజల తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలో గుడి చెరువు ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను ను రాష్ట్ర దేవాదాయ శాఖ, జౌలి శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్, టూరిజం శాఖ ఎండి హనుమంతు, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ అఖిల్ మహాజన్ ల తో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ నూలు డిపో ఏర్పాటు నేతన్నల చిరకాల కోరిక అని,సీఎం రాకతో నేతన్నల 30ఏండ్ల కల నెరవేరనుంది అని అన్నారు.శృంగేరి పీఠం వారి ఆదేశాల మేరకు బ్రాహ్మణుత్సవములచే రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని అన్నారు.రాజన్న భక్తులకు సులువుగా శీఘ్రమైన దర్శనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంమని,ఆనాడు పిసిసి అధ్యక్షుడి హెూదాలో వచ్చిన రేవంత్ రెడ్డి నేడు సీఎం హెూదాలో ఆలయానికి వచ్చి రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడాలని స్వామివారిని వేడుకుంటారు అని అన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల ప్రకటించిన బడ్జెట్లో రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించడం జరిగింది అని అన్నారు.సీఎం పర్యటనలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయం, యారన్ డిపోతో పాటు రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారు అని అన్నారు.

సీఎం పర్యటనతో ఇప్పటికే ముగింపు దశకు చేరుకున్న ప్రాజెక్టు పనులతో పాటు శ్రీపాద ప్రాజెక్టు పనులకు అడుగులు పడనున్నాయని అన్నారు. సీఎం పర్యటనకు సంబంధించి అన్ని రకాల పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని,జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సీఎం పర్యటనకు సంబంధించి మినిట్ టూ మినిట్ షెడ్యూల్ తయారవుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ స్థపతి వల్లి నాయగం, ఈవో వినోద్ రెడ్డి,ఇతర అధికారులు ఉన్నారు..

# విద్యార్థులకు నోట్ బుక్‌లు, పెన్నులు పంపిణీ



- జాతీయ పాత్రికేయ పత్రిక విలేకరుల దినోత్సవం సందర్భంగా...
- ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో పాత్రికేయ పత్రిక విలేకరుల దినోత్సవం సందర్భంగా ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని బురుగుపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని,విద్యార్థులకు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు, ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ: సమాజంలో జర్నలిస్టుల పాత్ర చాలా గొప్పదని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి లాగా నిరంతరం పనిచేస్తారని తెలిపారు. జర్నలిస్టుల సేవలు సమాజానికి ఎంతో దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బోయిని వేణు యాదవ్, మ్యాన జగదీష్, తాళ్లపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటాం

- తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల. సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల తాజా మాజీ సర్పంచులందదరూ డిమాండ్ చేశారు. కరీంనగర్ ప్రెస్ క్లబ్ లో ప్రెస్ మీట్‌లో వారు మాట్లాడుతూ "రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్న, సర్పంచులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిన నేటికి సర్పంచ్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి స్పందన లేకపోవడం చాలా బాధాకరం, శాంతియుతంగా చేస్తున్నటువంటి మా సర్పంచుల ఉద్యమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చులకనగా చూస్తూ, సర్పంచులపై కక్ష్య సాధింపు చేస్తుంది. కాబట్టి ఉమ్మడి కరీంనగర్ సర్పంచులందదరూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ఆందోళన కార్యక్రమాలు చేపడతాం. ఈనెల 25వ తారీకు సోమవారం రోజున కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేపడతాం' అని హెచ్చరించడం జరిగింది.సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాతనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పర్యటించాలని, లేనిపక్షంలో 20వ తారీకు సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తాజా మాజీ జే.ఏ.సీ సర్పంచులు అక్కెనపెల్లి కరుణాకర్, దుమ్మ అంజయ్య, పంజాల జగన్మోహన్ గౌడ్, మల్ల మేఘరాజ్, జోగు సాగర్, శ్రీనివాస్, గంప వెంకన్న, కే.దామోదర్ రెడ్డి, గుంటుకు లచ్చన్న, లింగంపల్లి కరుణాకర్, మొగిలి సమ్మయ్య, లేచినేని నవీన్ రావు, రెడ్ల శ్రీనివాస్, వేముల దామోదర్, శ్రీనివాస్, గౌతం, ధర్మ రెడ్డి, మరియు ఉమ్మడి కరీంనగర్ జిల్లా తదితర సర్పంచులు పాల్గొన్నారు.

# వ్యవసాయదారులకు మాత్రమే ఫర్టిలైజర్ అమ్మాలి

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో శనివారం వ్యవసాయ అధికారి ప్రణీత సమక్షంలో బోయినిపల్లి మండల ఎస్సై పృథ్వీధర్ ఆధ్వర్యంలో ఫర్టిలైజర్, పెర్టిసైడ్ షాపు యజమానులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది.ఈ సమావేశంలో మండలంలోని పెర్టిసైడ్, ఫర్టిలైజర్ వ్యవసాయదారులకు మాత్రమే ఇవ్వాలని, ఇతరులు ఎవరైనా పెస్టిసైడ్ కావాలని అడిగితే ఇవ్వవద్దని షాపు యజమానులకు సూచనలు ఇవ్వనైనది. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ఫర్టిలైజర్ షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.






## నటి కస్తూరి అరెస్ట్..

**బలగం టీవీ , హైదరాబాద్**

నటి కస్తూరి అరెస్ట్ అయ్యారు. తెలుగు వారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో చెన్నై పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని నటి కస్తూరి వేసిన పిటిషన్‌ను కోర్టు ఇటీవల కొట్టివేసింది. దీంతో ఆమె పరారీలో ఉంది. రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలించారు. చివరికి నటి కస్తూరి ఆచూకీ హైదరాబాద్లో లభ్యమైంది. ఆమెను ప్రస్తుతం పోలీసులు చెన్నై తరలిస్తున్నారు.

ఈ నెల 3వ తేదీన చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో నటి కస్తూరి షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. తన వ్యాఖ్యలపై కస్తూరి క్షమాపణలు చెప్పినప్పటికీ పలు చోట్ల ఆమెపై పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయి.

## బెంగళూరులో ఐటీ సమ్మిట్

**బలగం టీవీ , హైదరాబాద్**

ఆస్ట్రేలియా అధికారిక భాగస్వామ్య పక్షంగా బెంగళూరులో మూడురోజుల టెక్ సమ్మిట్ జరుగుతుంది. ఈ నెల 19వ తేదీన ఈ సదస్సును కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రారంభిస్తారు. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎలక్ట్రానిక్స్, ఐటి, బిటి విభాగం ఈ ఐటి సదస్సును నిర్వహిస్తుంది. ప్రారంభ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ అంతర్జాతీయ ప్రతినిధులు ఈ ఐటి సదస్సు నేపథ్యంలోనే కర్నాటక ప్రభుత్వం స్విట్జర్లాండ్, ఫిన్లాండ్లతో రెండు వేర్వేరు కీలక ఒప్పందాలకు దిగుతుందని అధికారులు శనివారం తెలిపారు.

# జేపీ నడ్డా, మల్లికార్జున ఖర్గేకు ఈసీ షాక్..

**బలగం టీవీ , హైదరాబాద్**

మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకదానికొకటి ఈసీకి ఫిర్యాదులు చేశాయి. దీంతో ఈసీ జేపీ నడ్డా, మల్లికార్జున ఖర్గేకు వేర్వేరుగా లేఖ రాసింది. నవంబర్ 18 మధ్యాహ్నం నాటికి వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

కాంగ్రెస్ అగ్రనేత, విపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారం చేసేటప్పుడు తన ప్రసంగంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని బీజేపీ ఈసీకి ఇటీవలే ఫిర్యాదు చేసింది. మరోవైపు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా సైతం తన ప్రసంగంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని కాంగ్రెస్ ఈసీని ఆశ్రయించింది. ఇలా ఫిర్యాదులు వచ్చిన క్రమంలోనే ఎన్నికల సంఘం ఇరు పార్టీల అగ్రనేతలకు లేఖలు రాసింది. ఇటీవల లోక్‌సభ ఎన్నికల సందర్భంగా స్టార్ క్యాంపెయినర్లకు చేసిన సూచనలను ఈసీ మారోసారి ప్రస్తావించింది. జాతీయ పార్టీల స్టార్ క్యంపెయినర్లు ఇతరులకు ఆదర్శంగా ఉండాలని.. సమాజంలో సున్నితమైన కుర్చును పాడుచేయొద్దని



సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈసీ సూచనలు చేసింది. మళ్లీ ఇప్పుడు కూడా ఇదే విషయాన్ని గుర్తు చేసింది.




## భారత్ మహిళలకు నాలుగో విజయం

**బలగం టీవీ , హైదరాబాద్**

మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో భారత్ వరుసగా నాలుగో విజయం నమోదు చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0 గోల్స్ తేడాతో చైనాను ఓడించింది. ఆరంభంలో ఇరు జట్లు నువ్వానేనా అన్నట్టు పోరాడాయి. గోల్స్ కోసం తీవ్రంగా శ్రమించాయి. కానీ గోల్ సాధించడంలో విఫలమయ్యాయి. ద్వితీయార్ధంల మాత్రం భారత్ ఎటాకింగ్ గేమ్‌తో చెలరేగి పోయింది. స్టార్ క్రీడాకారిణి సంగీత కుమారి అద్భుత ఆటతో 32వ నిమిషంలో భారత్‌కు తొలి గోల్‌ను అందించింది. కొద్ది సేపటికే కెప్టెన్ సలీమా జట్టు రెండో గోల్ సాధించి పెట్టింది. ఇక చివర్లో దీపిక మూడో గోల్ నమోదు చేసింది. దీంతో భారత్ 3-0తో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. లీగ్ దశలో భారత్‌కు ఇది వరుసగా నాలుగో గెలుపు కావడం విశేషం.

# విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా? : బండి సంజయ్



**బలగం టీవీ , హైదరాబాద్**

విద్యార్థులు చనిపోతున్నా పట్టించుకోరా? అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. బాసర ట్రిపుల్ ఐటి పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థి స్వాతి ప్రియ ఆత్మహత్యకు గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. స్వాతిప్రియ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కేంద్రమంత్రి కోరారు. ఏబీవీపీ నాయకులపై పోలీసులు, బాసర ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడాన్ని ఖండించారు. ఆత్మహత్య చేసుకున్న బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి న్యాయం చేయాలని నిరసన చేస్తుంటే పోలీసులు, బాసర ట్రిపుల్ ఐటీ సెక్యూరిటీ సిబ్బంది విచక్షణారహితంగా దాడి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. విద్యార్థుల పక్షాన ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను ఎక్కడికక్కడ అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని అన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ చేసిన ఏబీవీపీ నాయకులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జాప్యం చేయకుండా బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల పక్షాన ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను ఎక్కడికక్కడ అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని ఆయన మండిపడ్డారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని బండి సంజయ్ కోరారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థి స్వాతి ప్రియ ఆత్మహత్యకు కారణాలపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

## నయనతారకి ధనుష్ లీగల్ నోటీసులు

**బలగం టీవీ , హైదరాబాద్**

నయనతారతో నెట్‌ఫ్లిక్స్ ఓ డాక్యుమెంటరీని తీస్తున్న విషయం తెలిసిందే. ఈ డాక్యుమెంటరీలో ఆమె నటించిన 'నానుమ్ రౌడీ దాన' సినిమా నుంచి 3 సెకన్ల వీడియోను వినియోగించారు. అయితే ఈ 3 సెకన్ల వీడియో ఉపయోగించడంపై చిత్ర నిర్మాత ధనుష్ నయనతారకు లీగల్ నోటీసులు పంపించారు. రూ.10 కోట్లు అపరాధ రుసుము చెల్లించాలని కూడా డిమాండ్ చేశారు. ఈ వివాదంపై నయనతార సోషల్ మీడియా వేదికగా ధనుష్‌పై విమర్శలు చేశారు. బహిరంగ లేఖను విడుదల చేశారు. నయనతార, విజరు సేతుపతి ప్రధాన పాత్రల్లో వచ్చిన 'నానుమ్ రౌడీ దాన్' సినిమాని నయనతార భర్త విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించారు. వండర్ బేర్స్ బ్యానర్‌పై ధనుష్ ఈ సినిమాను నిర్మించారు.

# నేటి నుంచి గ్రూప్-3 పరీక్షలు

- **1,401 పరీక్షా కేంద్రాల ఏర్పాటు**
- **5.36 లక్షల మంది దరఖాస్తు**

**బలగంటీవీ, హైదరాబాద్**

: గ్రూప్ 3 పరీక్షలకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు సిద్ధం చేసింది. నేటి నుంచి ఈ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మూడు పేపర్లు రాయాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు చర్యలు చేపట్టారు. అభ్యర్థులకు టీజీపీఎస్సీ కీలక సూచనలు చేసింది.

హాల్ టికెట్ ఉన్నవారినే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు.

ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒక ఒరిజినల్ ఐడీని(Passport, Pan Card, Voter ID, Aadhaar Card, Government Employee ID లేదా డ్రైవింగ్ లైసెన్స్ ) చూపించాల్సి ఉంటుంది.

హాల్ టికెట్ పై క్లియర్ గా కనిపించేలా ఫొటో ఉండాలి. ఇలా లేకపోతే గెజిటెడ్ అధికారితో సంతకం చేయించుకోవాలి.

పరీక్షా కేంద్రాన్ని ఒక రోజు ముందుగానే చూసుకుంటే ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్త పడొచ్చు.

ఉదయం 08. 30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. 09.30 గంటలకు గేట్లు మూసివేస్తారు.

ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి తీసుకెళ్లరాదు.

మాల్ ప్రాక్టీసింగ్, చీటింగ్ వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయి. టీజీపీఎస్సీ పరీక్షలు రాయకుండా చర్యలు తీసుకుంటారు.

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు మొదటి సెషన్‌లో పేపర్ -1 ఎగ్జామ్ ఉంటుంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి 05:30 వరకు సెకండ్ పేపర్ పరీక్ష జరుగుతుంది. ఇక నవంబర్ 18వ తేదీన పేపర్-3 ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు జరుగుతుంది. https://www.tspsc.gov.in/ వెబ్ సైట్ లో పూర్తి వివరాలను తెలుసుకోవచ్చని తెలిపింది.

# టెక్స్ టైల్ పార్క్ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు..!

- **ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**
- **863 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు**

**బలగంటీవీ, హైదరాబాద్**

వరంగల్ మెగా టెక్స్ టైల్ పార్క్ భూనిర్వాసితులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వరంగల్ లోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా 863 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 863 మందికి స్టేట్ రిజర్వ్ కోటా కింద ఇందిరమ్మ ఇళ్లు కట్టించేందుకు తగిన చర్యలు చేపట్టాల్సిందిగా ఆర్ అండ్ బీ సెక్రటరీ జ్యోతి బుద్ధా ప్రకాష్ ఆర్డర్స్ జారీ చేశారు. దీంతో తొందర్లోనే కాకతీయ మెగా టెక్స్ టైల్స్ పార్క్ పక్కనే భూ నిర్వాసితుల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పడనుంది.

# కాంగ్రెస్‌కు బీజేపీ రక్షణ కవచం



**(మొదటి పేజీ తరువాయి)**

సీటు సీటు ఉంటుండేనా? పదవులు ఉండటం కాదు. ప్రజల గుండెల్లో కేసీఆర్ గారికి ప్రత్యేక స్థానం ఉంది రేవంత్ రెడ్డి టెక్నికల్ ప్రాబ్లమ్స్‌తో ఎత్తైన కుర్చీలో కూర్చుంటున్నాడు. ఎత్తైన కుర్చీలో కూర్చుంటే పెద్దోళ్లు అయిపోరు కేసీఆర్ రైతుబంధు రూ. 10 వేలు బిచ్చం వేసినట్లు వేస్తున్నాడు.. మేము రూ. 15 వేలు ఇస్తాం అని నువ్వే కదా అన్నావ్ వానాకాలం రైతు బంధు ఇప్పటికీ పడలేదు. దాన్ని ఎగ్గొట్టారు. రైతన్నలు ఇప్పుడు మోసపోయామని బాధపడుతున్నారు కేసీఆర్ లక్ష రుణమాఫీ చేస్తే నేను రెండు లక్షలు చేస్తా అంటివి సోనియమ్మ బర్త్‌డే నాడే చేస్తా అంటివి. ఒక ఏడాది అయిపోయింది. మళ్లీ సోనియమ్మా బర్త్‌డే వస్తోంది ఇప్పటి వరకు రైతు రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వలేదు సోనియా గాంధీని మాత్రమే కాదు. మొత్తం ప్రజలందరినీ మోసం చేశాడు దేవుళ్లను కూడా వదలకుండా ఏ దేవుని దగ్గరకు పోతే అక్కడ ఒట్లు వేశాడు దేవుళ్లను మోసం చేసిన మొదటి వ్యక్తి ఈ రేవంత్ రెడ్డి పంద్రాగస్ట్ లోపు రుణమాఫీ అంటివి. ఎగిరెగిరిపడితివి. హరీష్ రావుతో సవాల్ చేస్తివి. ఇప్పుడు ఏమైంది? ఒక్క హిందూ దేవుళ్లను మాత్రమే కాదు అన్ని మతాల దేవుళ్లను మోసం చేశాడు జిల్లాల్లో కాంగ్రెస్ హామీలు నమ్మి కొంతమంది మోసపోయారు. కానీ హైదరాబాద్‌లో కాంగ్రెస్ నైజం తెలుసు కాబట్టి వాళ్లకు ఓటు వేయలేదుహైదరాబాద్ ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనాలు మనం గెలిపించిన వాళ్లు మనల్ని వదలిపోయారు. కానీ ఆయన పశ్చాత్తాపం చెందటం ఖాయం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన వెళ్లిపోయిన సరే కార్యకర్తలే పార్టీ నడుపుతుండటం సంతోషాన్నిస్తోంది. ప్రతిపక్షంగా ఉండి కూడా ప్రజల కోసం పోరాడి వాళ్ల గుండెల్లో శాశ్వత స్థానం సంపాందిచుకోవచ్చు. మూసీ పేరుతో ఢిల్లీకి మూటలు పంపేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నస్తున్నాడని మూసీ బాధిత ప్రాంతాల్లో పర్యటించాం రాజేంద్రనగర్ నియోజకవర్గం మొత్తం మేము తిరిగితే.. ప్రజలు చాలా ఆవేదన వ్యక్తం చేశారు మా కష్టంలో ఎవరు మాతో ఉన్నారో మాకు అర్థమైందని అన్నారు 40, 50 ఏళ్ల నుంచి ఉన్న మీ భూములకు రిజిస్ట్రేషన్లు చేసి ట్యాక్స్‌లు కట్టించుకొని కబ్జాదారులు అంటారా? కోట్ల విలువ చేసిన ఇళ్లను కూలగొట్టి.. ప్రజలను దిక్కులేని వాళ్లను చేసే ప్రయత్నం చేస్తున్నారు కేసీఆర్ కట్టించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లనే తాను కట్టించినట్లు ఇస్తామని చెబుతున్నాడు బీజేపీ నాయకులు మొత్తానికి రేవంత్ రెడ్డి చేసిన సవాల్‌కు స్పందించి ఇవ్వాళ మూసీ పక్కన పండుకుంటారంట.. చాలా సంతోషం మూసీలో జరుగుతున్న అక్రమాలపై ప్రజలకు ఖచ్చితంగా వివరంగా చెప్పాల్సి అవసరం మాపైన ఉంది మూసీకి పునరుజ్జీవం అని రేవంత్ రెడ్డి పదే పదే చెబుతున్నాడు గత 60 ఏళ్ల నుంచే మూసీలోకి మురికి నీళ్లు వస్తున్నాయి. మూసీని మనమే మురికి కూపం చేసినట్లు మాట్లాడుతున్నాడు" అని అన్నారు.

### రేవంత్ రెడ్డికి రక్షణ కవచంగా నలుగురు బీజేపీ నేతలు

రేవంత్ రెడ్డికి ఎప్పుడు కష్టం వచ్చినా కేంద్రమంత్రి బండి సంజయ్ ముందు నిలబడతారని, రెప్పవాల్చకుండా... రక్షణగా ఉంటూ కాపాడుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. బండి సంజయ్ కేంద్ర సహాయమంత్రిగా కాకుండా రేవంత్ రెడ్డి సహాయమంత్రిగా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డిని తిడితే... రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ వంటి బీజేపీ ఎంపీలకు కోపం వస్తోందని ఆరోపించారు. ఈ నలుగురు బీజేపీ నేతలు రేవంత్ రెడ్డికి రక్షణ కవచంగా ఉంటున్నారన్నారు. వీరు రేవంత్ రెడ్డి పార్టీలో ఉన్నారా? లేక బీజేపీలో ఉన్నారా? అని ప్రశ్నించారు.

# టీజీసెట్ 2024 ఫలితాలు విడుదల

**బలగంటీవీ, హైదరాబాద్**

టీజీసెట్ 2024 ఫలితాలను తాజాగా విడుదల అయ్యాయి. టీజీ సెట్ 2024 ప్రొవిజనల్ కీ ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. కాగా, తాజాగా, హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం టీజీసెట్ ఫలితాలు విడుదల చేసింది. అభ్యర్థుల ఫలితాలు టీజీసెట్ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచారు. పరీక్షకు మొత్తం 33వేల 494 మంది దరఖాస్తు చేసుకోగా 26వేల 294 మంది పరీక్షలకు హాజరయ్యారు. టీజీసెట్ ఫలితాల్లో 1,884 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఫలితాలకోసం అభ్యర్థులు అధికారిక వెబ్సైట్ (www.telanganaset.org) లో చూసుకోవచ్చని అధికారులు తెలిపారు. దరఖాస్తు నంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేయటం ద్వారా ఫలితాలను చూసుకోవచ్చని వెల్లడించారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానానికి బాంబు బెదిరింపు

**బలగంటీవీ, హైదరాబాద్**

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. హైదరాబాద్ నుంచి బ్యాంకాక్ వెళ్లాల్సిన విమానం గేటు వద్దకు రాగానే బాంబు ఉందంటూ ఓ ప్రయాణికుడు అలజడి సృష్టించాడు. వెంటనే అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో విమానంలో 136 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానాన్ని ఐసోలేషన్ ప్రాంత్రానికి తీసుకెళ్లి తనిఖీలు చేశారు. ఎలాంటి బాంబూ లేదని తేల్చారు. గత కొన్నిరోజులుగా విమానాలకు నకిలీ బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బెదింపులకు పాల్పడే వ్యక్తులపై విమాన ప్రయాణ నిషేధం విధించాలని పౌర విమానయాన శాఖ ఆలోచిస్తున్నది.

## జాగో తెలంగాణ : కేటీఆర్

**బలగంటీవీ, హైదరాబాద్**

సన్నాలకు బోనస్‌పై కాంగ్రెస్ సర్కార్ సవాలక్ష కొర్రీలు పెట్టడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దపు హామీలు నమ్మి ఓట్లేస్తే భస్మాసుర హస్తం కాటేస్తుందన్నారు. 420 హామీల కాంగ్రెస్ పాలనో రైతుభరోసా ?15 వేలు రాలేదని, ?2 లక్షల రుణమాఫీ కాలేదని, 24 గంటల ఉచిత కరెంటు మాయమైందని విమర్శించారు. పంటల కొనుగోళ్లు చెయ్యలేదని, వరి ధాన్యం క్వింటాలుకు బోనస్ ?500 ఇయ్యలేదన్నారు. జాగో తెలంగాణ అంటూ శనివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు.

# వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఉండదు



- **తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**

**బలగంటీవీ, హైదరాబాద్**

తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీపై సంచలన ఆరోపణలు చేశారు. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఉండదన్నారు. పదేళ్లలో తెలంగాణ అభివద్ధి జరగలేదని.. కేవలం దోపిడే జరిగిందని విమర్శించారు. గత ప్రభుత్వం కంటే మేము మెరుగైన పాలన అందిస్తున్నాం అన్నారు. "బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు పోస్టులు పెడుతున్నారు. రాష్ట్రంలో విపక్ష పార్టీగా వ్యవహరించడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది. అధికారం కోల్పోయామనే అసహనంతో కేటీఆర్ మాట్లాడుతున్నారు. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఉండదు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాల కన్నా ఏడాది వ్యవధిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉద్యోగాలే ఎక్కువ. ప్రస్తుతం దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది. మిగతా రాష్ట్రాల్లో కూడా తెలంగాణ తరహా స్కీమ్స్ కావాలని కోరుతున్నారు. కుల గణన వల్ల తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుంది. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధిలో బీఆర్ఎస్ నేతలతో మాట్లాడేందుకు చర్చకు నేను సిద్ధం. మేము అన్ని రకాల ప్రజలను మెప్పించాం. అందుకే విజయోత్సవ సభలు కూడా నిర్వహిస్తున్నాం. వరంగల్ విజయోత్సవ సభకు 'ఇందిరా మహిళా శక్తి సభ'గా నామకరణం చేశాం" అని పేర్కొన్నారు.

## మహాయుతి కూటమిని గెలిపించాలి : పవన్ కల్యాణ్

**బలగంటీవీ, హైదరాబాద్**

మహారాష్ట్ర సంస్కృతి, మరాఠి భాషను రక్షించుకోవాలంటే మహాయుతి కూటమిని గెలిపించుకోవాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా.. డేగ్లూర్ బహిరంగ సభకు పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. పధాని మోదీ అధికారం చేపట్టిన తర్వాత.. జమ్ము కాశ్మీర్ లో శాంతి కనిపిస్తుందని, అద్భుత అయోధ్య నిర్మాణం సాధ్యమైందని, నలువైపుల నూతన రోడ్లు నిర్మాణమవుతున్నాయంటూ ప్రశంసించారు. మరోవైపు.. బీజేపీ హయలోనే దేశంలోని రైతులు, పారిశ్రామిక వేత్తలకు అందుతున్న ప్రయోజనాల్ని ప్రస్తావించారు. సనాతన ధర్మ కోసం బలంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కారణంగానే ఇక్కడి దేవాలయాలు భద్రంగా ఉన్నాయన్నారు.

# మైక్ టైసన్‌ను ఓడించిన యూట్యూబర్



బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచ గొప్ప బాక్సర్‌లలో ఒకరైన 58 ఏండ్ల మైక్ టైసన్ ఓ 27 ఏండ్ల బాక్సర్ జేక్ పాల్ చేతిలో ఓడిపోయాడు. మ్యాచ్ మొత్తంలో టైసన్‌పై జేక్ పాల్ ఆధిపత్యం చెలాయించాడు. ఆ క్రమంలో టైసన్ శరీరం, ముఖంపై బలమైన పంచ్‌లను కొట్టాడు. దీంతో మ్యాచ్‌ను పాల్ 78-74తేడాతో గెలుచుకున్నాడు.

టెక్సాస్‌లో జరిగిన బిగ్ బౌట్‌లో.. 58 ఏళ్ల టైసన్ తన కన్నా 37 ఏళ్ల చిన్నోడైన జేక్ చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. ఓ దశలో బాక్సింగ్ ప్రపంచాన్ని తన వైపు తిప్పుకున్న టైసన్.. ఈ ఫైట్ కోసం చాలా ప్రిపేరయ్యాడు. కానీ జేక్ విసిరిన పంచ్‌లకు బలయ్యాడు. టైసన్‌లో వేగం తగ్గినట్లు బాక్సింగ్ సీనియర్లు అంచనా వేశారు. మొత్తం 8 రౌండ్ల మ్యాచ్‌లో టైసన్ పెద్దగా పర్ఫార్మ్ చేయలేకపోయాడు. ప్రతి రౌండ్ నిమిషాల పాటు సాగింది. జేక్ పౌల్ పంచ్‌లకు టైసన్ చాలా సార్లు దొరికిపోయాడు. గట్టిగా దెబ్బలు తగులుతున్నా.. వాటి తట్టుకుని టైసన్ ఎదురుదాడికి ప్రయత్నించాడు. ఏడవ రౌండ్‌లో టైసన్ కుడివైపు జేక్ పవర్‌ఫుల్ పంచ్ ఇచ్చాడు.

2005లో ప్రొఫెషనల్ బాక్సింగ్ నుంచి టైసన్ రిటైర్ అయిన విషయం తెలిసిందే. రింగ్‌లో అతను ఇప్పటి వరకు కేవలం ఆరుసార్లు మాత్రమే ఓడాడు. వయసుకు తగ్గ ఫైట్ కాకపోయినా.. టైసన్ మాత్రం తనలో దాగిన ఐరన్ గుండెను ప్రదర్శించాడు. 8వ రౌండ్ చివరలో టైసన్ ముందు తలవంచాడు పౌల్. అతనికి గ్లౌజ్‌లు ఇచ్చేశాడు టైసన్. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో పౌల్ విజేతగా నిలిచాడు. ఓ జడ్జి 80-72 స్కోర్ ఇచ్చాడు. మరో ఇద్దరు జడ్జీలు 79-73 స్కోరుతో పౌల్‌కు విక్టరీని అందజేశారు.

# రోహిత్ శర్మకు కొడుకు పుట్టాడు




బలగం టీవీ, హైదరాబాద్

టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ మరో తండ్రి అయ్యాడు. అతడికి రెండో సంతానం కలిగింది. హిట్ మ్యాన్ భార్య రితికా సజ్దే శుక్రవారం రాత్రి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని సమాచారం. అయితే ఈ జంటకు ఇప్పటికే ఓ కుమార్తె ఉన్న సంగతి తెలిసిందే. కాగా, భార్య రితికా సజ్దే నిండు గర్భిణి కావడం, డెలివరీపై డాక్టర్లు ఇచ్చిన సమాచారం కారణంగా రోహిత్ శర్మ ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లలేదు. దీంతో అతడు ఈ నెల 22న ప్రారంభమయ్యే బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ తొలి టెస్టుకు దూరమవుతాడని వార్తలు కూడా వచ్చాయి. తన భార్య రితికా త్వరలో రెండోసారి బిడ్డకు జన్మనివ్వనుండటం వల్ల, తనను తొలి టెస్టు నుంచి మినహాయించాలని రోహిత్ శర్మ బీసీసీఐని కోరాడని.. అందుకు బీసీసీఐ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ప్రచారం సాగింది. అయితే ఇప్పుడు శుక్రవారమే రితిక ప్రసవం అయిపోవడం వల్ల రోహిత్ తొలి మ్యాచ్‌లో ఆడే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

## హెూంబలే ఫిల్మ్స్ నుంచి 'మహావతార్ నరసింహ'

బలగం టీవీ, హైదరాబాద్

ప్రముఖ నిర్మాణ సంస్థ హెూంబలే ఫిల్మ్స్ తాజాగా ఓ సరికొత్త ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసింది. అశ్విన్ కుమార్ డైరెక్షన్‌లో 'మహావతార్: నరసింహ' అనే సినిమాను ప్రకటించింది. ఇందులో భాగంగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. అయితే ఇందులో నటించేవారి గురించి అలాగే టెక్నికల్ టీమ్ గురించి త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలుస్తోంది. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి సామ్ సీఎస్ సంగీతం అందించనున్నారు. కుశాల్ దేశాయ్, శిల్పా ధావన్, చైతన్య దేశాయ్‌లు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అయితే 'మహావతార్' సిరీస్‌లో రానున్న తొలి సినిమా ఇదే కావడం విశేషం. ఇక ఈ సినిమాకు కొనసాగింపుగా ఇతర అవతారాలతో చిత్రాలు రాబోతున్నాయని నిర్మాణ సంస్థ చెప్పింది.




# టీ20 సిరీస్ కైవసం చేసుకున్న ఆసీస్



బలగం టీవీ, హైదరాబాద్

పాకిస్థాన్‌తో వన్డే సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా టీ20 సిరీస్ కైవసం చేసుకుంది. గబ్బా మైదానంలో గ్లెన్ మ్యాక్స్‌వెల్ మెరుపులతో జయకేతనం ఎగురువేసిన ఆసీస్ రెండో టీ20లోనూ అదే జోరు చూపింది. ప్రత్యర్థిపై 13 పరుగుల విజయంతో సిరీస్‌లో రెండడుగులు ముందుకేసింది. మొదట ఓపెనర్లు మాథ్యూ షార్ట్(32), జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(20) లు పాక్ పేసర్లకు దడ పుట్టిస్తూ 3.4 ఓవర్లోనే 54 పరుగులు జోడించారు.ఈ జంటను విడదీసిన హ్యారిస్ రవుఫ్(4/22) పాక్‌కు బ్రేకిచ్చాడు. ఆ తర్వాత సుఫీయన్, అబ్బాస్ అఫ్రిదిలు కూడా చెలరేగగా ఆసీస్ కష్టాల్లో పడింది. గత మ్యాచ్ హీరో గ్లెన్ మ్యాక్స్‌వెల్(21) ధనాధన్ ఆడలేకపోయాడు. ఆఖర్లో అరోన్ హార్డీ(28), టిమ్ డేవిడ్(18)లు బ్యాట్ ఝుళిపించగా ఆసీస్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 147 పరుగులు చేసింది. స్వల్ప ఛేదనలో జాన్సన్ పాక్ నడ్డివిరిచాడు. యువపేసర్ స్పెన్సర్ జాన్సన్(5/26) నిప్పులు చెరిగాడు. పాక్ బ్యాటర్లలో ఓవైపు అందరూ డగౌట్‌కు క్యూ కడుతున్నా ఉస్మాన్ ఖాన్(52) ఒక్కడే అర్ధ శతకంతో ఒంటరి పోరాటం చేశాడు. అతడిని కూడా పెవిలియన్ పంపిన జాన్సన్ ఆస్ట్రేలియా సిరీస్ విజయంలో ముఖ్య భూమిక పోషించాడు. ఆసీస్ 13 పరుగుల తేడాతో విజయం సాధించింది.

## శాంసన్ సిక్స్‌కు పగిలిన దవడ



బలగం టీవీ, హైదరాబాద్

దక్షిణాఫ్రికాతో జరిగిన 4వ టీ20లో సంజూ శాంసన్ కొట్టిన ఓ భారీ సిక్సర్‌తో గ్యాలరీలో ఉన్న ఓ మహిళా అభిమానికి గాయమైంది. శాంసన్ సిక్సర్ ధాటికి ఓ లేడీ ఫ్యాన్ దవడ పగిలింది. ఆమెకు నొప్పితో విలవిలలాడింది. ఐస్ ప్యాక్ పెట్టుకుని కన్నీటి పర్యంతమైంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. సదరు మహిళా అభిమానికి దెబ్బ తగిలిన విషయాన్ని గుర్తించిన సంజూ శాంసన్ ఆమెకు సైగలతో క్షమాపణలు కూడా చెప్పాడు. ట్రిస్టన్ స్టబ్స్ వేసిన 10వ ఓవర్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది.



## 'అమరన్' నడుస్తున్న థియేటర్ వద్ద బాంబు దాడి

బలగం టీవీ, హైదరాబాద్

తమిళ బ్లాక్ బస్టర్ చిత్రం అమరన్ నడుస్తున్న థియేటర్ ముందు ఇద్దరు వ్యక్తులు బాంబుతో దాడి చేశారు. ఈ ఘటన తమిళనాడులోని తిరునెల్వేలి జిల్లాలో ఈ సినిమా నడుస్తున్న అలంగర్ థియేటర్ వద్ద చోటుచేసుకుంది. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు బయటికి రాగా.. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా అవుతున్నాయి. మరోవైపు ఈ ఘటనపై పోలీసులు స్పందిస్తూ.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఇక ఈ దాడిలో ఎవరికి గాయాలు కాలేదని.. స్థానిక గొడవల కారణంగానే ఈ దాడి జరిగినట్లు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు.

కోలీవుడ్ హీరో శివ కార్తికేయన్, నటి సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ అమరన్. ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ కథ ఆధారంగా ఈ సినిమా రాగా.. ఇందులో శివ కార్తికేయన్ ఆర్మీ అధికారి మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో నటించారు. దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది.

## పెండ్లి చేసుకున్న టాలీవుడ్ సింగర్స్

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ సింగర్ అనురాగ్ కులకర్ణి, మరో సింగర్ రమ్య బెహరా సీక్రెట్‌గా పెళ్లి చేసుకొని అందరిని ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం వీరి వివాహ వేడుకకు సంబంధించిన పెళ్లి ఫోటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక ఈ జంట పెళ్లి చేసుకున్నారు అని తెలియడంతో అభిమానులు కంగ్రాట్స్ చెబుతున్నారు. కాగా, అనురాగ్ఐడియా సూపర్ సింగర్ సీజన్ 8 విన్నర్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ తర్వాత సినిమాల్లో వరుసగా సాంగ్స్ పాడుతూ ప్రముఖ సింగర్‌గా మారాడు. ఆర్ఎక్స్ 100 సినిమాలో పిల్లారా సాంగ్ అనురాగ్‌కు మంచి గుర్తింపును తీసుకువచ్చింది. ఇక రమ్య బెహరా కూడా ఎన్నో అద్భుతమైన పాటలను పాడి మెప్పించింది. ఈమె సూపర్ సింగర్ 4లో పాల్గొంది.

